క్లుప్తంగా

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎలక్ట్రికల్ వస్తువులను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గాజువాక: గాజువాక లయన్స్ క్లబ్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా చిక్కా సత్యనారాయణ, సత్యాల కోటేశ్వరరావు, కోశాధికారిగా చదలవాడ జగదీష్ ఎన్నికయ్యారు. అనంతరం పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, వివిధ సంస్థలకు ఎలక్ట్రికల్ వస్తువులను వితరణ చేశారు. నూతన అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ 2023–24 సంవత్సరంలో పర్యావరణ, మెడికల్ క్యాంపులను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ కమిటీ సభ్యులు డి.రాఘవేంద్రరావు, ఆలపాటి సుబ్బారావు, పి.సత్యానందం, సుధారాణి, బలివాడ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్నెలమ్మ పండగ



శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: వర్షాలు పడాలని, రైతాంగం జోరుగా పంటలు పండించేందుకు సిద్ధమవ్వాలని కోరుతూ 75వ వార్డు నెల్లిముక్కులో సోమవారం కన్నెలమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. అనంతరం బంటుమాంబ, పెంటమాంబ అమ్మవార్ల ఆలయాల అభివృద్ధి కోసం విరాళాలు ఇచ్చిన దాతల పేర్లతో వేయించిన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి సత్యారావు, గొందేశి అప్పలరెడ్డి, కేఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి స్టీల్‌క్లబ్ వార్షిక వేడుకలు

ఉక్కునగరం: ఉక్కు కనిష్ట అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం స్టీల్‌క్లబ్ వార్షిక వేడుకలు ఈనెల 15 నుంచి జరగనున్నాయని స్టీల్‌క్లబ్ కార్యదర్శి జి. నారాయణ దొర తెలిపారు. క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో కార్యవర్గ సభ్యులు వార్షికోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మాన్‌సూన్ మేళా పేరిట పలు కార్యక్రమాలు, పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ జీఎం ఎం.మధుసూదనరావు, సన్ గ్రీస్ సంస్థ సీఈవో కె. శృతి, క్లబ్ కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పరిధిలో రోటరీ క్లబ్ విశాఖపట్నం నూతన కార్యవర్గం సోమవారం ప్రమాణస్వీకారం చేసింది. సర్దార్ నెస్ట్ వద్ద గల ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఉమామహేశ్వర్ రెడ్డి, కార్యదర్శిగా జొన్నలగడ్డ వెంకటగిరి, కోశాధికారిగా ప్రభాకర్ ఎన్నికయ్యారని క్లబ్ పూర్వ గవర్నర్ ఛాయాదేవి తెలిపారు. రోటరీ ఫౌండేషన్ చైర్మన్ వెంకటన్న చౌదరి, ఏయూ ప్రొఫెసర్లు తిమ్మారెడ్డి, విజయ్ ప్రకాష్, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), వాసవీ అధ్యక్షుడు సజ్జా పాండు రంగప్రసాద్, రవివర్మ, నిర్మల్ క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

13న కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ధర్నా

ఉక్కునగరం: కార్మికులకు ఎస్.ఎం.ఎ, ఎ.ఎస్.ఎం.ఎ, ఐఆర్ చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, బోనస్‌ను చెల్లించాలనే డిమాండ్‌తో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు ఈ నెల 13న ధర్నా చేపట్టనున్నాయి. ఈ మేరకు ధర్నా పోస్టర్‌ను ఎల్ఎంఎం పార్కులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నమ్మి రమణ, మంత్రి రవి, బొడ్డు గోవింద, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో అర్హులందరికీ పథకాలు

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



నాతయ్యపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరైన ప్రజలు

అక్కిరెడ్డిపాలెం: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమమే జగనన్న సురక్ష అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పేదలందరికీ లబ్ధి చేకూర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం, తుంగ్లాంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు 600 హామీలు గుప్పించి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఒకప్పుడు.. ప్రజలకు డబ్బులు పంచేస్తున్నారని విమర్శించిన చంద్రబాబు, ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పడం వారి పదవీకాంక్షకు నిదర్శనమన్నారు.

ప్రజలకు మంచి చేస్తున్నా విష ప్రచారమే..

ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై నిత్యం బురద జల్లడమే లక్ష్యంగా పెట్టుకుని, మంచి చేసినా చెడుగా విషప్రచారాలు చేస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం మాట్లాడుతూ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీ, షీలానగర్, హరిజన జగ్గయ్యపాలెం, కాపుతుంగ్లాం 1, కాపుతుంగ్లాం 2, చుక్కవానిపాలెం పరిధిలో కుల ధ్రువీకరణ పత్రాల కోసం 349 మంది, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు 206 మంది, రేషన్ కార్డుకు, మ్యారేజ్ తదితర 11 రకాల సర్టిఫికెట్ల కోసం 620 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో 69వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈఈ ప్రసాదరావు, డీటీ త్రినాథరావు, ఆర్ఓ రామనారాయణ, 3 వార్డుల ఇన్‌చార్జి మహ్మద్ గౌస్, ఈగలపాటి యువశ్రీ, గంధ్రెడ్డి రామునాయుడు, కాకి అప్పల రెడ్డి, రాము, వెంకటరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో అవగాహన

అగనంపూడి: ‘జగనన్న సురక్ష’పై 79వ వార్డు ప్రశాంతినగర్ వార్డు సచివాలయ పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణ, ఎంఎల్‌వో హేమంత్ , వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి ఎ.మహాలక్ష్మినాయుడు, జేసీఎస్ కన్వీనర్ రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి పాండా

ఉక్కునగరం: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు దోచి పెడుతోందని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా ఆరోపించారు. స్థానిక ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ రాష్ట్రస్థాయి యువ కార్యకర్తల రెండు రోజుల శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరగడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేని కేంద్రానికి పాలించే హక్కు లేదన్నారు. స్టీల్‌ప్లాంట్, బీఎస్ఎన్ఎల్, పెట్రోలియం, బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలను కేంద్రం కార్పొరేట్లకు చౌకగా అమ్మేస్తోందన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశం పూర్తిగా దివాలా తీస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. రవీంద్రనాథ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకట సుబ్బయ్య, కోశాధికారి కొండలరావు, కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదు’



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు తమ జీవితాల కోసం చేస్తున్న పోరాటానికి కేంద్రప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ అంశంలో నిర్ణయం మార్చుకోవాల్సిందేనని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 879వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బీమా పత్రాలు



పాడి రైతుకు బీమా పత్రం అందిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి, డాక్టర్ లావణ్య

అగనంపూడి: మూగ జీవులు, పెంపుడు జంతువుల పెంపకందార్లకు ఆసరాగా ఉండేందుకు వైఎస్సార్ పశు సంరక్షణ పథకం ద్వారా బీమా సౌకర్యం కల్పించినట్లు 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, అగనంపూడి పశువైద్యశాఖ వైద్యురాలు డాక్టర్ లావణ్య తెలిపారు. వైఎస్సార్ పశు సంరక్షణ పథకాన్ని అగనంపూడి వెటర్నరీ ఆస్పత్రిలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులకు ఈ పథకం వల్ల కలిగే లబ్ధిని వివరించారు. ఈ పథకంలో కేవలం 20శాతం రైతులు చెల్లిస్తే, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కో–ఆర్డినేటర్–2 ఇల్లపు ప్రసాద్, సహాయ వైద్యాధికారి వి.ఇందిరా రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై విస్తృత ప్రచారం



స్వచ్ఛ సర్వేక్షణ్ లక్ష్యాలను వివరిస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్

గాజువాక: స్వచ్ఛ సర్వేక్షణ్‌పై జీవీఎంసీ గాజువాక జోనల్ ప్రజారోగ్య విభాగం సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించింది. అందులో భాగంగా 67వ వార్డులోని స్ప్రింగ్‌డేల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇళ్లల్లో ఉత్పన్నమవుతున్న తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తలను వేరు చేసి ఇంటింటికీ వస్తున్న క్లాప్ వాహనాలకు ఇచ్చే విధంగా అందరికీ వివరించాలని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం ఈ సందర్భంగా కోరారు. అనంతరం శ్రీనగర్‌లోని టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో విద్యార్థులను కలిసి సిటిజన్ ఫీడ్ బ్యాక్ సేకరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ నంబర్ వన్ స్థానంలో నిలబడే విధంగా అందరూ సహకరించాలని కోరారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో సామాజిక మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో విస్కా నలభై వసంతాల విజయోత్సవాలు



విస్కా నలభై వసంతాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న విస్కా, కళాక్షేత్రం ప్రతినిధులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా) ఆధ్వర్యంలో ఆగస్టు 4 నుంచి 7 వరకు సాంస్కృతిక విజయోత్సవాలు నిర్వహించనున్నామని అసోసియేషన్ కార్యదర్శి ఎ. కేశవరావు తెలిపారు. స్థానిక ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. 1983 లో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల మానసిక ఉల్లాసం కోసం విస్కా ప్రారంభమైందన్నారు. సంగీతం, సాహిత్యం, నృత్యం, నాటకం తదితర కార్యక్రమాలతో గత 40 ఏళ్లుగా ప్రేక్షకుల ప్రశంసలు పొందామన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి సీహెచ్.వి. సత్యనారాయణ, ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు, కె.వి.భాస్కర్, టి. సత్యనారాయణ, విస్కా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఊరెళ్లి వచ్చేసరికి దోచేశారు

16 తులాల బంగారం అపహరణ



బీరువాలో చిందరవందరగా పడి ఉన్న దుస్తులు, తెరిచి ఉన్న లాకర్

అక్కిరెడ్డిపాలెం: బంధువుల ఇంటికి వెళ్లి, తిరిగి వచ్చేసరికి దొంగలు ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారాన్ని అపహరించుకుపోయారు. గాజువాక క్రైం సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్న బి.సత్యనరేష్ నాతయ్యపాలెం మర్రిచెట్టు పరిసరాల్లో కుటుంబంతో నివసిస్తున్నారు. నరేష్ భార్య ఈ నెల 6న, నరేష్ 8న కాకినాడ సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి 9న రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపు గొళ్లాలు విరగ్గొట్టి ఉన్నాయి. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువా లాకర్‌లో ఉండాల్సిన పదహారుంపావు తులాల బంగారంతో పాటు కొంత నగదు లేకపోవడాన్ని గుర్తించారు. దీంతో సత్య నరేష్ ఫిర్యాదు మేరకు గాజువాక క్రైం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సంఘటన స్థలానికి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ రప్పించి వివరాలు సేకరించారు. దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతికి అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతి డి.రామ్‌ప్రసాద్‌ను స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నాయకులు అభినందించారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో నాయకులు సోమవారం ఆయనను కలిసి, సత్కరించారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్లాంట్‌ను ప్రమాద రహిత సంస్థగా మార్చేందుకు కార్మిక సంఘాలు, ఉద్యోగులు సహకరించాలన్నారు. నాయకులు ప్లాంట్‌లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు గురించి విభాగాధిపతితో చర్చించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, అవతారం, బీఎంకె నాయక్, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అధికారి కుటుంబానికి ‘సీ’ చేయూత



ఉక్కు ఎల్‌డీసీ విభాగాధిపతి భానుకు చెక్కు అందజేస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: ఇటీవల అనారోగ్యంతో మరణించిన లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎల్‌డీసీ) విభాగం డీజీఎం పి. రమేష్ కుటుంబానికి ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆర్థికసాయం అందించింది. ఎల్‌డీసీ విభాగంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సీ నాయకులు విభాగాధిపతి భానుకు రూ. 4.25 లక్షలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 12 నెలలు కాలంలో 12 మందిని దురదృష్టవశాత్తు కోల్పోయామని, వారి కుటుంబాలకు సీ అండగా నిలిచి ఆర్థిక సహకారం అందించిందని తెలిపారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, చంద్ర వెంకటేశ్వరరావు, లోకేష్, ఎం. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలి



కార్మికులకు మద్దతు తెలుపుతున్న ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో కార్మికులకు కనీస వేతనం 36వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద గల స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు వెంటనే జీతా లు పెంచాలని, తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అనుచరుడైన ఆదాని గంగవరం పోర్టు టేకోవర్ చేసుకున్నప్పటి నుంచి కార్మికుల పరిస్థితి మరి అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్, నాయకులు ఆదినారాయణ, కొవిరి అప్పలరాజు, డీవీ రమణ, కసిరెడ్డి సత్యనారాయణ, జె. రామకృష్ణ తదితరులు కార్మికులకు మద్దతు తెలిపారు.

ప్రతీ గడపలో సమస్యల పరిష్కారమే లక్ష్యం



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: ప్రతీ గడపలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కొనసాగుతోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలు లేమర్తి, పి.బోనంగి, పాసకాలయ్యపేటల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు సమస్య, ఇళ్ల పట్టాలు, స్థలాల సమస్యలు జగనన్న సురక్ష కార్యక్రమంలో తెలియజేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయ పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జేసీఎస్–2 కన్వీనర్ ఇల్లపు ప్రసాద్, బోర సోమునాయుడు, ఐతి అప్పలరాజు, ఇల్లపు వాసు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం



పాతగాజువాకలో మానవహారం నిర్వహిస్తున్న వలంటీర్లు

గాజువాకలో ర్యాలీ, మానవహారం

గాజువాక: వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గాజువాక నియోజకవర్గంలోని వలంటీర్లు సోమవారం ఆందోళన నిర్వహించారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం నుంచి వందడుగుల రోడ్, జాతీయ రహదారి మీదుగా పాతగాజువాక జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం చేపట్టారు. పవన్ కల్యాణ్ ఎటువంటి రుజువులు లేకుండా తమపై ఆరోపణలు చేయడం దుర్మార్గమని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము డేటాను సేకరించేది కేవలం సంక్షేమ పథకాలను ఇవ్వడం కోసమేనని, ఆ డేటాను ఏ పార్టీ నాయకులకు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఒంటరి మహిళల వివరాలను వైఎస్సార్‌సీపీ నాయకులకు అందజేస్తున్నామన్న ఆరోపణలను రుజువు చేయాలని, లేనిపక్షంలో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్లలో అన్ని పార్టీలకు చెందిన అభిమానులు ఉన్నారని, జనసేన అభిమానులు, తెలుగుదేశం అభిమానులుగా ఉన్న వలంటీర్లు తాము సేకరించిన డేటాను ఎవరికి ఇస్తున్నారో చెప్పగలరా అని ప్రశ్నించారు. తాము సేవ చేయడానికి వలంటీర్లుగా వచ్చామని, కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలను అందించామని పేర్కొన్నారు. ఆ సమయంలో పవన్ కల్యాణ్ గాని, జనసేన పార్టీ కార్యకర్తలు గాని తమ ఇళ్ల నుంచి బయటకు రాలేదన్నారు. అలాంటివారు ఇప్పుడు వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని హెచ్చరించారు.

ప్యాకేజీ స్టార్‌కు నైతిక విలువలు లేవు

- చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టుతో సైకోలా ప్రవర్తన
- పవన్ కల్యాణ్ తీరుపై ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆగ్రహం



అక్కిరెడ్డిపాలెం: జనసేన అధ్యక్షుడు, ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్‌కు నైతిక విలువలు లేవని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి విమర్శించారు. వలంటీర్లపై నోరు పారేసుకున్న పవన్ కల్యాణ్ తీరు జుగుప్సాకరంగా ఉందని మండిపడ్డారు. నాతయ్యపాలెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సినిమాల్లో వేషాలు వేసుకునే పవన్ కల్యాణ్‌కు రాజకీయాలు తెలియవని, రాజకీయాలకు పనికిరాడని అన్నారు. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టులు చదివి, చంద్రబాబులా సైకోలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థను ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయని, అందరి మన్నలు పొందాయన్నారు. కరోనా కాలంలో వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలకు చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. మహిళా వలంటీర్లపై అలాంటి విమర్శలు చేసిన పవన్ కల్యాణ్‌ది నాలుకా? తాటిమట్టా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లకు భేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు.

అలాంటి వ్యక్తికి రాజకీయాలెందుకు?

గత ఎన్నికల్లో గాజువాకలో పవన్ కల్యాణ్‌కు 85 వేల ఓట్లు పడ్డాయని, కానీ కరోనా కష్టకాలంలో తనకు ఓటు వేసిన ప్రజలను కనీసం చూడటానికి కూడా పవన్ రాలేదని అన్నారు. అటువంటి వ్యక్తికి రాజకీయాలెందుకని ప్రశ్నించారు. అసలు రాజకీయాల్లో ఎందుకు ఉన్నారో ఆయనకే తెలియదని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికా, లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయడానికా అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. పవన్ కల్యాణ్ తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని అంటూ దమ్ముంటే 175 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు.

‘వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలి’



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా చినతల్లి

గాజువాక: ఆంధ్రప్రదేశ్ మహిళాలోకంపై, వలంటీర్ వ్యవస్థపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి డిమాండ్ చేశారు. 67వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. కరోనా కష్టకాలంలో వలంటీర్లు చేసిన సేవలు అభినందనీయమని, అలాంటివారిపై ఇష్టానుసారంగా మాట్లాడితే మహిళా లోకం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా పెంటారావు, మీరా, అన్నపూర్ణ, లక్ష్మి, సూర్య, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘కించపరిచేలా మాట్లాడారు’

అగనంపూడి: వలంటీర్లను కించపరిచేలా మాట్లాడిన పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ డిమాండ్ చేశారు. అగనంపూడిలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలపై, వలంటీర్ వ్యవస్థపై ఏ మాత్రం అవగాహన లేని పవన్ అవివేకంతో మాట్లాడడం వల్ల తనకు ఉన్న కొద్దిపాటి సానుభూతిని కూడా కోల్పోతున్నారన్నారు. ప్రజాస్వామ్యం, వ్యవస్థల పట్ల ఏ మాత్రం గౌరవం ఉన్నా వెంటనే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యలమంచిలి అప్పారావు, కె.లక్ష్మి, చిన్ని సుష్మ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. మండలాభిషేక మహోత్సవం



కలశ పూజల్లో పాల్గొన్న ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ దంపతులు



స్వామిని దర్శించుకుంటున్న దేవన్ రెడ్డి, కుటుంబసభ్యులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో నిర్మించిన శ్రీ తిరుమల బాలాజీ మందిరంలో మండలాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. 108 కలశాలను ఏర్పాటు చేసి విశేష పూజలు చేశారు. ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ దంపతులు కలశపూజలో పాల్గొన్నారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్నిధ్యానం, కుంభారాధన అష్టోత్తర శతకలశ స్నపనం (108 కలశాలతో స్వామి వారికి అభిషేకం), విశేష మూలమంత్ర హోమం చేసి మహా పూర్ణాహుతి సమర్పించారు. బాలాజీని పంచామృతాలతో అభిషేకించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీబీఎల్ జీఎం జి.వి.కృష్ణయ్య, జీవన్‌బాబు, జి.గంగా మహేష్, గాంధీ, శ్రీ తిరుమల బాలాజీ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వహిత పింఛన్ల పంపిణీ



నిరుపేదలకు పింఛన్లు అందిస్తున్న దేవన్‌రెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ 75 మంది నిరుపేద మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు అందించింది. మూడు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ నెలా 75మందికి రూ.2వందల చొప్పున పింఛన్‌తో పాటు రవాణా చార్జీలు చెల్లిస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్–2 కో–ఆర్డినేటర్ ఇల్లపు ప్రసాద్, రైల్వే ఎస్‌సీసీ సభ్యుడు కొలిపాక అప్పారావు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.